ఆరోగ్యశ్రీకి కేటాయింపు అంతంతే

- ప్యాకేజీల సవరణతో 487 కోట్ల భారమంటూ ప్రకటన
- 54% పెరుగుతుందంటూ ప్రచారం
- బడ్జెట్‌లో పెరగని కేటాయింపులు

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యశ్రీ కేటాయింపులపై వైద్యశాఖ వింత వైఖరి అవలంబిస్తున్నది. ప్రచారానికి.. కేటాయింపులకు సంబంధం లేదని వైద్యవర్గాలు విమర్శిస్తున్నాయి. ఈ ఏడాది ఆరోగ్యశ్రీలో కొత్త చికిత్సలు చేర్చామని, ప్యాకేజీల ధరలు సవరించామని వైద్యారోగ్యశాఖ ఇటీవల ప్రకటించింది. దీంతో అదనంగా ప్రభుత్వంపై రూ.487 కోట్ల భారం పడుతుందని గొప్పలు చెప్పుకున్నది. కానీ వాస్తవంలోకి వచ్చేసరికి పూర్తిగా చేతులెత్తేసింది. 2023-24లో ఆరోగ్యశ్రీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.865 కోట్లు కేటాయించింది. ప్యాకేజీల సవరణతో ఈ ఏడాది 54 శాతం బడ్జెట్ పెరుగుతుందని ఈ నెల 22న వైద్యారోగ్యశాఖ తెలిపింది. ఈ లెక్కన ఈ ఏడాది రూ.1,350 కోట్ల బడ్జెట్ కేటాయిస్తారని వైద్యనిపుణులు ఆశించారు. కానీ.. ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.957 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకొన్నది. దీంతో ఆర్భాటపు ప్రకటనలే తప్ప నిధుల కేటాయింపు ఏదీ? అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది అసలు ప్యాకేజీల సవరణ అమలు చేస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి 2014 నుంచి ఏటికేడు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందేవారి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. 2014-15లో 1.17 లక్షల మందికి 1.96 లక్షల చికిత్సలు చేయగా.. 2023-24 నాటికి సుమారు 3 లక్షల మందికి దాదాపు 5 లక్షల చికిత్సలు నిర్వహించినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది అదనంగా 163 వ్యాధులను జతచేసిన నేపథ్యంలో.. బడ్జెట్ కేటాయింపులు పెరుగుతాయని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బాలికలకు బడ్జెట్ ఏది?

- హైజీన్ కిట్లకు కేటాయింపుల్లేవు
- కేజీబీవీల ప్రహరీలపైనా చిన్నచూపు

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖ బడ్జెట్‌లో విద్యార్థినులపై ప్రభుత్వం చిన్నచూపు చూసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.17,942 కోట్లు కేటాయించినట్టు ప్రభుత్వం చెప్తున్నా.. ఇందులో రూ.14, 929 కోట్లు వేతనాలకే ఖర్చు చేస్తున్నదని, మిగతా రూ.3001 కోట్లు మాత్రమే ప్రగతి పద్దు కింద కేటాయించిందని గుర్తు చేస్తున్నారు. ప్రగతి పద్దులో విద్యార్థినులకు హైజీనిక్ కిట్ల పథకానికి నిధులు కేటాయించకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు హై జీనిక్ కిట్లను అందించిందని గుర్తు చేస్తున్నారు. దాదాపు 7 లక్షల మంది ప్రయోజనం పొందారని, ఈ ఏడాది నిధులు కేటాయించకపోవడంతో పథకాన్ని మూలకు పడేసినట్టేనని విమర్శిస్తున్నారు. ఇక.. బాలికలు చదివే కస్తూర్బా పాఠశాలలకు ప్రహరీలు నిర్మించడంపైనా విద్యాశాఖ తీవ్ర అలసత్వం ప్రదర్శించిందని చెప్తున్నారు. రూ.1952 కోట్లను సమగ్ర శిక్ష పథకం కింద ఆన్‌గోయింగ్ పనులకు కేటాయించారని, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ.500 కోట్లు కేటాయించారని అంటున్నారు. ఇలా రూ.3001 కోట్లలో రూ.2877 కోట్లు ప్రధాన పథకాలకే వెళ్తాయని, మిగతా నిధులనే పాఠశాలల్లో మౌలిక వసతులకు, కొత్త పథకాలకు కేటాయించారని చెప్తున్నారు. ఇవి నామమాత్రమేనని అంటున్నారు.

ఇచ్చిన హామీల అమలెప్పుడు?

- నిరుద్యోగుల హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు?
- డీఏ, పీఆర్సీ ఎప్పుడిస్తరు?
- పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి
- అసెంబ్లీ పద్దులపై చర్చ సందర్భంగా హరీశ్ రావు

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని, రూ.4వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వాటిని ఎపుడు అమలు చేస్తారో చెప్పాలని నిలదీశారు. నియామకాలకు సంబంధించి గతంలో ఉన్న జీవో 55ను మార్చి, జీవో 29 తేవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-2 పోస్టులు రెండువేలకు, గ్రూప్-3 పోస్టులు మూడు వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు చెప్పారని, బస్సుయాత్రలు పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు న్యాయ సమస్యల వంక చెప్తున్నారన్నారని విమర్శించారు. 2015లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రూప్-2 పోస్టులను 435 నుంచి 1032కు పెంచినట్టు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తక్షణం పెండింగ్ డీఏలు ఇస్తామని, మెరుగైన పీఆర్సీ ఇస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామన్నారని తెలిపారు. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

గతంలో ఏటా మార్చి 31న రూ.5 కోట్లలోపు ఉన్న బిల్లులు క్లియర్ చేసేవాళ్లమని ఈసారి అలా జరగలేదన్నారు. కనీసం రూ.కోటి లోపు ఉన్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. కేంద్రం ఈజీఎస్ పథకం కింద రూ.800 కోట్లు వచ్చి 3 నెలలు అయ్యిందని, దానికి రాష్ట్ర గ్రాంటు రూ.350కోట్లు జమ చేయడం లేదన్నారు. రెండూ కలిపి 1100 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్‌శాఖ బాగా పని చేస్తే వైద్యశాఖపై ఒత్తిడి తగ్గుతుందని, కానీ ఇప్పుడు దవాఖానలు రోగులతో నిండిపోయాయని తెలిపారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు పాత బకాయిలు చెల్లిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని, ఇప్పుడు పాత బకాయిలు ఇవ్వబోమని అంటున్నారని మండిపడ్డారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి బిల్లులు విడుదల చేయాలని కోరారు. జూలై పెన్షన్ రిలీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంపై సభాహక్కుల నోటీసులిస్తం

మొదటిపేజీ తరువాయి...

లేఖలను చూపుతూ, వాటిలోని విషయం మొత్తాన్ని చదవకుండా తనకు అనుకూలమైన అంశాలను మాత్రమే చదువుతూ అసలు విషయాలు దాచిపెడుతున్నారని మండిపడ్డారు. సభా నాయకుడిగా పదిమందికీ ఆదర్శంగా ఉండాల్సిన ముఖ్యమంత్రే మూడు అంశాల్లో సభను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంపై తాము వాయిదా తీర్మానం, సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం నోటీసు ఇస్తామని తెలిపారు.

1) సాగునీటి అంశంపై చర్చ జరుగుతుండగా 'రిటైర్డ్ ఇంజినీర్లు సూచించిన లేఖ ఇది' అంటూ అందులోని అనుకూలమైన అంశాన్ని మాత్రమే సీఎం చెప్పారని హరీశ్‌రావు పేర్కొన్నారు. మేడిగడ్డ నుంచి డైరెక్ట్‌గా మిడ్‌మానేరుకు నీళ్లు తీసుకుపోవడం సాధ్యం కాదు, మధ్యలో ఎన్టీపీసీ ఉన్నది, బొగ్గుబావులు ఉన్నాయి, ఎలక్ట్రిసిటీ వైర్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి నేరుగా మిడ్‌మానేరు దాకా తీసుకుపోవడం సాధ్యం కాదని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారని తెలిపారు. దీనిని వదిలేసి 'అసలు మేడిగడ్డే ఫీజిబుల్ కాదు' అని రిటైర్డ్ ఇంజనీర్లు అన్నారంటూ సభను సీఎం తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. నేరుగా మేడిగడ్డ నుంచి నీళ్లను లిఫ్ట్ చేయటం సాధ్యం కాదన్నారు కాబట్టే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కట్టి నీటిని ఎల్లంపల్లికి తెచ్చినట్టు వివరించారు.

2) విద్యుత్తు అంశంపై చర్చ సందర్భంగా కరోనాతో నష్టం, ఉదయ్ పథకం, 14వ ఆర్థిక సంఘం సిఫారసులు వంటి కారణాల వల్ల రూ.41వేల కోట్ల అప్పులు రాష్ట్రంపై పడ్డాయని సభ దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించినట్టు చెప్పారు. ఈ క్రమంలో వ్యవసాయ బోర్లకు, బావులకు మీటర్లు పెడితే కర్ణాటక, ఏపీ మాదిరిగా కేంద్రం నుంచి అదనంగా తెలంగాణకు రూ.30 వేల కోట్లు అప్పు తెచ్చుకునే అవకాశం ఉండేదని, కానీ తాము ప్రజలు, రైతుల స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వదులుకున్నట్టు తెలిపారు. ఈ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని 'మీరు మోటర్లకు మీటర్లు పెడ్తామని ఒప్పందం చేసుకున్నారు' అంటూ అధికారుల పేర్లు పదే పదే చదివారని తెలిపారు. కానీ అదే లేఖలోని 'అదర్ దేన్ అగ్రికల్చర్ కనెక్షన్స్' (వ్యవసాయేతర కనెక్షన్లు) అన్న పదాలను వదిలేశారని మండిపడ్డారు. సీఎం స్థాయిలో ఉన్న నాయకుడు ఒక పేరాగ్రాఫ్‌లో రెండు పదాలను ఎగరగొట్టొచ్చా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే సభను తప్పుదారి పట్టిస్తే శాసనసభకు విలువ ఉంటదా? అని ప్రశ్నించారు. పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు పెట్టాలని, వ్యవసాయేతర కనెక్షన్లకు అని స్పష్టంగా ఉదయ్ ఒప్పందంలో ఉన్నదన్నారు. దాన్ని వదిలేసి మోదీతో కేసీఆర్ కలిసిపోయాడంటూ పేర్కొనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

3) బీఆర్‌ఎస్ మంత్రులుగా ఉన్న సమయంలో నాయిని నర్సింహారెడ్డి ఇన్‌చార్జిగా ఉండి, దగ్గరుండి పోతిరెడ్డిపాడును ప్రారంభించారంటూ సభను సీఎం మరోసారి తప్పుదారి పట్టించారని మండిపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్న సమయంలోనే పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు పొక్క పెట్టించారని సీఎం పేర్కొనడాన్ని ఖండించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ వంటి నాయకులే పదవుల కోసం పెదవులు మూశారని దుయ్యబట్టారు. జూలై 4, 2005వ తేదీన తాము ఆరుగురు మంత్రులం రాజీనామా చేసినట్టు గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ పవిత్రను కాపాడడం, పులిచింతల, తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లు, 610 జీవో అమలు చేయకపోవడం వంటి అంశాలపైనా తాము మంత్రిపదవులకు రాజీనామా చేశామని వివరించారు. 2005 డిసెంబర్ 19న పోతిరెడ్డిపాడు జీవో వచ్చిందని తెలిపారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్టు

కాంగ్రెస్ పార్టీ 2004లో బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నప్పుడే రాష్ట్రం ఇస్తే ఆత్మబలిదానాలు జరిగేవి కాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. డిసెంబర్ 9 ప్రకటనను డిసెంబర్ 23న వెనక్కి తీసుకున్న సమయంలో 'ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలి' అని తెలంగాణ ప్రజలు ఆదేశిస్తే తాము రాజీనామా చేసినట్టు చెప్పారు. అప్పుడు టీడీపీ నుంచి కొంతమంది ఎమ్మెల్యేలు చంద్రబాబుకు జిరాక్స్ కాగితాలపై రాజీనామా చేశారని, రేవంత్‌రెడ్డి కనీసం ఆ జిరాక్స్ కూడా ఇవ్వలేదన్నారు. ఆయన ఉద్యమనాయకుడినని చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉన్నదని ఎద్దేవా చేశారు. నాడు 'జై తెలంగాణ' అంటే తుపాకీతో కాల్చేస్తానన్నట్టుగా వ్యవహరించడం వల్లే ఆయనకు రైఫిల్‌రెడ్డి అని పేరొచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకపోతే రేవంత్ పీసీసీ ప్రెసిడెంట్ అయ్యేవారా? ఇవ్వాళ సీఎం అయ్యేవారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడకుంటే రేవంత్ ఇంకా టీడీపీలో చంద్రబాబు చేతి కిందే ఉండేవారని హరీశ్‌రావు విమర్శించారు.

ఒకే టర్మ్‌లో 2సార్లు కేసీఆర్ రాజీనామా

ఒకే టర్మ్‌లో రెండుసార్లు ఎంపీ పదవికి రాజీనామా చేసిన చరిత్ర కేసీఆర్‌దని హరీశ్‌రావు చెప్పారు. కేంద్రమంత్రి, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే ఇలా అనేకసార్లు తన పదవులను రాజీనామా చేసిన ఉదంతాలను ఆయన వివరించారు. కేసీఆర్ చేసినన్ని రాజీనామాలు ఎవరు చేశారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కనీసం ఒక్కసారి రాజీనామా చేయటమే కాదు కనీసం జై తెలంగాణ అన్నారా? అని నిలదీశారు.

తెలంగాణ ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ పని అయిపోయిందని పేర్కొనటం కాంగ్రెస్ నేతల భావదారిద్రానికి నిదర్శనమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 18 రాష్ట్రాల్లో ఒక్క ఎంపీ సీటు గెలవలేదని అంటే ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పని అయిపోయినట్టేనా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉందన్నారు.

జైపాల్‌రెడ్డి ఏ పార్టీని ఒప్పించారు?

జైపాల్‌రెడ్డి పెద్ద తెలంగాణ వాది. తాను చిన్న తెలంగాణ వాది అన్నట్టు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తెలంగాణకు అనుకూలంగా కేసీఆర్ 36 రాజకీయ పార్టీల నుంచి లేఖలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. తెలంగాణకు అనుకూలంగా జైపాల్‌రెడ్డి ఏ పార్టీ నుంచి లేఖ తెచ్చారని ప్రశ్నించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై మాటమీద నిలబడాలి

ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పలువురు నాడు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

సీఎం పనితీరు బాగాలేనట్టేనా?

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ సీటు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓడిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరిలోక్‌సభ స్థానంతోపాటు, ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లోనూ మెజారిటీ తగ్గిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీని అర్థం ముఖ్యమంత్రి పనితీరు బాగాలేనట్టేనా అని ప్రశ్నించారు.

రుణమాఫీపై ద్వంద్వ వైఖరి

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రుణమాఫీపై మొదట్లో రూ. 41వేల కోట్లు అని, తరువాత రూ. 39వేల కోట్లు అని ఆ తరువాత రూ.. 31వేల కోట్లు అని చెప్పి తీరా బడ్జెట్‌లో రూ. 25వేల కోట్లే ప్రతిపాదించారని పేర్కొన్నారు.

24 గంటల విద్యుత్తుకు ఆద్యుడు చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి...

ఆదాయంలో అధిక భాగం నాడు యూపీఏ-1,2లో తీసుకున్న నిర్ణయాలే కారణం' అని తెలిపారు.

అంతా సోనియమ్మ.. జైపాల్ దయ

నాడు బీహార్ నుంచి జార్ఖండ్ విజన్ సందర్భంగా 42% ఉన్న జనాభాకు 42శాతం విద్యుత్తు వినియోగం ఇచ్చారని, అదే పద్ధతిలో తెలంగాణకు కూడా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించడం, ఏ ప్రాంతంలో విద్యుత్తు ప్రాజెక్టులు ఉన్నాయో అవి ఆ ప్రాంతానికే ఇచ్చే వెసులుబాటు చట్టంలో ఉండటంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రం విడిపోతే తెలంగాణ చీకటి అవుతుందని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారని, దీంతో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు నాటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డితో మాట్లాడరని తెలిపారు. ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా వినియోగం ప్రాతిపదికన విద్యుత్తు పంపిణీ జరగాలని జైపాల్‌రెడ్డి.. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియాతో మాట్లాడించి స్పీకింగ్ ఆర్డర్ ఇప్పించారని చెప్పారు. ఆ విధంగా తెలంగాణకు 53.46 శాతాన్ని ఇప్పించారని, ఆయన కృషి ద్వారానే తెలంగాణకు చీకట్లు తొలగాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. సోనియమ్మ దయ, జైపాల్‌రెడ్డి కృషి వల్లే తెలంగాణ విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కిందని తెలిపారు. 'నాడు 7వేల మెగావాట్ల విద్యుత్తు ఉంటే, నేడు 19వేల మెగావాట్లకు తీసుకెళ్లామని బీఆర్‌ఎస్ నేతలు చెప్తున్నారు. ఎవరి ఉత్పత్తి చేశారు? వీరు చేశారా? వీళ్ల తాతలు ఉత్పత్తి చేశారా?' అంటూ పదేండ్ల బీఆర్‌ఎస్ కష్టాన్ని కొట్టిపారేశారు.

సోం డిస్టిలరీ నుంచి కాంగ్రెస్‌కు 1.8 కోట్లు

- ఆ కంపెనీ కల్తీ బీర్లు తాగి చాలా మంది మరణించారు
- మధ్యప్రదేశ్ మాజీ సీఎం నుంచి ఇక్కడి సీఎంకు డైరెక్షన్
- ఆర్టీసీలో 'చలో మొబిలిటీ'కి ఆఫ్‌లైన్ టెండర్ ఎలా ఇచ్చారు?
- ఈ రెండు కంపెనీలపై హౌజ్ కమిటీతో విచారణ చేయాలి
- అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీకి సంబంధించి చలో మొబిలిటీ సంస్థపై, ఎక్సైజ్ శాఖకు సంబంధించి సోం బిస్లరీ వ్యవహారంపై హౌజ్ కమిటీ వేయాలని, వీటిపై విజిలెన్స్, సీబీఐ విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ ఫ్లైయాష్ సరఫరాలో, ఛలో మొబిలిటీ, సోం డిస్టిలరీ వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సోం డిస్టిలరీకి కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ నేతలు చెప్తున్నారని, కానీ ఆ సంస్థ నుంచి కాంగ్రెస్‌కు భారీ మొత్తంలో ఫండ్ అందిందని తెలిపారు. 2019-20లో 1.31 కోట్లు, 2013-14లో, 2018-19లో రూ.25 లక్షల చొప్పున రూ.50 లక్షలు.. మొత్తంగా రూ.1.80 కోట్లు ఇచ్చారని వెల్లడించారు. అధికారికంగానే ఇన్ని నిధులొస్తే, అనధికారికంగా ఇంకెన్ని నిధులు వచ్చాయోనని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో తమ బ్రాండ్ల సరఫరాకు అనుమతి వచ్చినట్టు సోం బేవరేజెస్ ప్రకటించిందని, ప్రభుత్వం మాత్రం తాము అనుమతి ఇవ్వలేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. దీన్ని క్యాన్సిల్ చేసినట్టు మంత్రి తెలిపారని, కానీ ఆ అనుమతి రద్దు చేయలేదని సెబీ నుంచి సమాధానం వచ్చిందని ఎండగట్టారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం నుంచి తెలంగాణ సీఎంకు డైరెక్షన్ రావటంతో సంబంధిత మంత్రికి తెలియకుండా ఇదంతా జరిగిందని వివరించారు. మధ్యప్రదేశ్‌కు సోం డిస్టిలరీ రూ.575 కోట్లు చెల్లించకపోవటంతో బ్లాక్ లిస్టులో పెట్టారని, ఆ కంపెనీ కల్తీ బీర్లు తాగి చాలా మంది చనిపోయారని గుర్తుచేశారు.

వే బిల్లులపై సంతకం లేకుండా తరలింపు

ఫ్లైయాష్ సరఫరాలో భారీ స్కాం జరుగుతున్నదని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. వే బిల్‌లో ఎలాంటి బరువు నమోదు చేయకుండా, సంతకం లేకుండా సరఫరా చేస్తున్నారని, ఓవర్‌లోడ్‌తో తీసుకెళ్తున్నారని తెలిపారు. తమ కార్యకర్తలు ఓవర్‌లోడ్ లారీలను ఆపితే.. మూడు లారీలను సీజ్ చేసి మిగిలిన లారీలను మంత్రి ఫోన్ చేయగానే వదిలేశారని మండిపడ్డారు. హుజురాబాద్ నుంచి లారీలు వెళితే తాను ఆపుతుండటంతో దారి మళ్లించి హుస్నాబాద్ నుంచి తీసుకెళ్తున్నారని వెల్లడించారు. ఆటోడ్రైవర్లకు నెలకు రూ.10 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోయి సుమారు 59 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు.

మద్యం ఆదాయంతో సంక్షేమ పథకాలు వద్దు: పాయల్ శంకర్

ప్రభుత్వ మనుగడ మద్యంపై ఆధారపడి పనిచేయటం దారుణమని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ఈ డబ్బుల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తే ప్రజలకు మంచి చేసినట్టు కాదని అన్నారు. సోమవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ.. కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నదని, దవాఖానలపాలై రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ గణన చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గొల్ల కురుమలు చెల్లించిన డీడీలు వాళ్లకు ఇచ్చేసి వాళ్ల వాటాలేకుండానే పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు.

ఆఫ్‌లైన్‌లో ఆర్టీసీ టెండర్ ఎందుకు?

ఆటోమెటిక్ ఫెయిర్ కలెక్షన్‌ను ఆన్‌లైన్ టెండర్ వేయకుండా ఆఫ్‌లైన్ టెండర్ ద్వారా చలో మొబిలిటీ సంస్థకు అప్పగించారని కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఆఫ్‌లైన్ టెండర్‌ను ఎందుకు పిలిచారు? అని ప్రశ్నించారు. టెండర్ పిలిచి రద్దు చేసినట్టు ప్రకటించిన ఆర్టీసీ.. ఆ తర్వాత మళ్లీ ఎలా ఆ సంస్థకు కట్టబెట్టింది? అని నిలదీశారు. 'ఫెయిర్ కలెక్షన్‌పై తమ బృందం బీహార్, అస్సాం, ఇండోర్, జబల్‌పూర్‌కు స్టడీ టూర్‌కు వెళ్లిందని ఆర్టీసీ చెప్తున్నది. టూర్ ఆదేశాలకు, టెండర్ ఇవ్వడానికి మధ్య 3 రోజులే గ్యాప్ ఉన్నది. అంత తక్కువ సమయంలోనే 4 రాష్ట్రాలు ఎలా తిరిగి వస్తారు? అని ప్రశ్నించారు. ఆర్టీఐ ద్వారా టూర్ వివరాలను అడిగితే తమ వద్ద సమాచారం లేదని ఆర్టీసీ చెప్పిందని.. మంత్రికి, ప్రభుత్వానికి సంబంధం లేదని తెలిపిందని.. మరి దీనికి బాధ్యులు ఎవరు? అని నిలదీశారు.

మూసీ సుందరీకరణ ఎలా చేస్తారో చెప్పండి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పేరిట ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న హైడ్రా విధానంతో గ్రేటర్ హైదరాబాద్ నగర అభివృద్ధి, శివారు మున్సిపాల్టీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్‌కు చెందిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంత డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సోమవారం పద్దులపై జరిగిన చర్చలో వివేకానంద మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణకు సంబంధించిన డీపీఆర్‌ను అందజేయాలని, ఎప్పటిలోగా పూర్తిచేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వరదల ముంపునకు పరిష్కారంలో ఎస్‌ఎన్‌డీపీని చేపట్టిందని, ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్ 2ను కూడా ప్రారంభించాలని కోరారు. ట్రాఫిక్ సమస్య నివారణకు గత ప్రభుత్వం అమలు చేసిన ఎస్‌ఆర్‌డీపీ పాలసీని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ తాగు నీటి అవసరాల రీత్యా సుంకిశాలను సత్వరమే పూర్తిచేయాలని, అందుకు అదనంగా నిధులు కేటాయించాలని సూచించారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, ఎక్సైజ్ షాపుల కేటాయింపులో 30శాతం గౌడ కమ్యూనిటీకి రిజర్వ్ చేయాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ క్రేజ్.. కాంగ్రెస్ నేతల సెల్ఫీలు



అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం కరీంనగర్, సిరిసిల్ల, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కనిపించగానే పరుగెత్తుకొచ్చి ఫొటోలు దిగారు. 'నాతో ఫొటో దిగుతున్నారు.. మీ నాయకులు ఏమనుకోరా?' అని కేటీఆర్ ఛలోక్తి విసిరితే.. ఫొటోలు ఎందుకు దిగొద్దన్నా? దిగితే ఏమైతది' అని పేర్కొనటం గమనార్హం.

తెలంగాణ చరిత్ర తొలగింపును ఆపండి: కేటీఆర్

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు గత ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని కుట్రపూరితంగా తొలగిస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు చేపట్టి సమాచారాన్ని కాపాడాలని సీఎస్ శాంతికుమారిని కోరారు. ఈ అంశంపై గతంలో తాను బహిరంగ లేఖ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ముఖ్యమైన సమాచారాన్ని తొలగించిందని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తొలగించిన సమాచారమంతా తెలంగాణ చరిత్రలో అంతర్భాగమని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్ర, ముఖ్యమైన సమాచారమంతా భవిష్యత్తు తరాలకు అందిచేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

బొగ్గు లోడింగ్ కార్మికులకు న్యాయం చేయాలి

బీఆర్‌ఎస్‌ఎల్వీలో కేటీఆర్‌కు వినతిపత్రం అందజేత

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): సింగరేణి వే బ్రిడ్జిల వద్ద బొగ్గు లారీ లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి తగిన సౌకర్యాలు కల్పించేలా చూడాలంటూ సింగరేణి వేబ్రిడ్జి కోల్ లారీ లోడింగ్, అన్‌లోడింగ్ లెవలింగ్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మాజీ మంత్రి కేతారకరామారావును కలిసిన సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలోని 47 వే బ్రిడ్జిల వద్ద 1,755 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులకు వైద్య పరీక్షలు, మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ) ఉచిత శిక్షణను సింగరేణి సంస్థ చేపట్టాలని, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) సౌకర్యం కూడా కల్పించాలని, సింగరేణిలో ఖాళీ క్వార్టర్స్‌ను కార్మికులకు కేటాయించాలని కోరారు. తీవ్ర అన్యాయానికి గురవుతున్న కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో ఆ సంఘం అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి యాకూబ్‌షా వలి తదితరులు ఉన్నారు.

రాజ్యమేలుతున్న అశాంతి-అభద్రత

మొదటిపేజీ తరువాయి...

పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశాం. నిమిషంలోనే లక్ష వాహనాల సీసీ ఫుటేజీలను రికార్డు చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాం. ఒక్క సంవత్సరంలోనే రాష్ట్ర పోలీస్ శాఖకు 60 అవార్డులు వచ్చాయి' అని సబితా ఇంద్రారెడ్డి గుర్తుచేశారు.

దేశంలోనే మొదటి స్థానం

రాష్ట్రంలో 11.10 లక్షల కెమెరాలు ఏర్పాటు చేశామని, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణతో కేసులు పరిష్కరించామని, కొత్తగా ఏర్పడిన 10 జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేశామని సబిత చెప్పారు. తెలంగాణ పోలీసింగ్ దేశంలో నంబర్ 1 స్థానంలో నిలిచిందని, ప్రపంచంలో 16వ స్థానం పొందిందని ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2023 తెలిపినట్టు గుర్తుచేశారు. 2019లో 19వ స్థానం, 2020లో 10వ స్థానం, 2023లో 1వస్థానంలో నిలిచింది. ఇది గత ప్రభుత్వ డైరెక్షన్, పోలీసుల పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. పోలీసు ఉద్యోగాల నియామకం, పోలీస్ వ్యవస్థలో ఆదాయం పెంపు, గస్తీల పెంపు, సీసీ కెమెరాల నిర్వహణ, అత్యాధునిక పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, వేతనాల పెంపు, మహిళల రిజర్వేషన్లు, పోలీస్‌స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు, శిక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సబిత వివరించారు. బాధితులకు తక్షణ సాయం చేయడంలో దేశంలో తెలంగాణ పోలీసులకు 5వ స్థానం దక్కిందని గుర్తుచేశారు.

వారి ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని కాదు

పోలీసులు పనిచేయడం లేదనో! పోలీసులపై నిందలువేసి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలనో తాను మాట్లాడడం లేదని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు.ప్రస్తుతం రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో హత్యలు పెరిగాయని, అంతర్రాష్ట్ర ముఠాలు పెట్రేగిపోతున్నాయని ఇవన్నీ చూస్తుంటే ఆందోళన కలుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న పత్రికలే వారం పదిరోజులుగా పతాక శీర్షికతో ఈ నగరానికి ఏమైందని రాశాయని, జూన్‌లో రోజుకో హత్య జరిగినట్టు రాశాయని, ఆదివారం 3 హత్యలు జరిగాయని ప్రభుత్వ అనుకూల పత్రికలోనే వచ్చిందని చెప్పారు.

వాస్తవాలే మాట్లాడుతున్నాం..

గిరిజన మహిళపై అత్యాచారం జరిగితే ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధులు వెళ్లి పరామర్శించే దాకా ప్రభుత్వం తరపున ఎవరూ వెళ్లలేదని సబిత ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన మహిళపై గ్యాంగ్ రేప్ జరిగిందని, మలక్‌పేటలోని అంధుల పాఠశాలలో వికారాబాద్‌కు చెందిన అంధబాలికపై రేప్ జరిగితే 10-15 రోజుల తర్వాత ప్రభుత్వం తరపున పరామర్శించారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేస్తే10 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.